# ఒహారకం

'గిరి'

"త్వమసి మమ భూషణం,
త్వమసి మమ జీవనం......"

౧

నాకిదం తేమీ తెలీదు నిజంగా. ఎప్పుడూ నాపూలూ, నాపాటలూ, నాగొడవే నాకు గాని యితర్ల యెక్క డేం చేస్తోన్నారో కనిపెడ్తోండడం నా స్వభావం కాదు. నాది అట్లాంటి స్వభావమే అయితే మావారు గోపాలకృష్ణుడి అవతారమైనందుకు ఈ కళ్ళతో యింకా యెన్ని దృశ్యాల చూసేదాన్నో, యీ చెవులతో యెన్నివిషయాల వినేదాన్నో!

డాక్టరుగారి కాంపౌండులో ఆపడమరవేపు మూల కున్న పొగడచెట్టంటే బలేసరదా నాకు. మధ్యాహ్నంపూట దానినీడలో మట్టసంగా కత్తిరించిన గరకమీద చల్లగా అడ్డమొరిగి చదువుతోనో, పాడుతోనో వుంటే నా కమితానందం కలిగేది. ఆవాళ మధ్యాహ్నంకూడా అక్కడే ఉన్నా. వాళ్ళ బుజ్జి ఆవుతో ఆవుతో అట్లాగే నాపక్కన గరకమీద నిండుగా పూసిన తెల్లగులాబిమొక్కపక్కన నిదరపోయింది. బోర్లగా ఆవల్లనిగరకమీద పడుకొని గరకపోచ నొకదాన్ని పళ్లమధ్య కొరుకుతో యేదో ఆలోచిస్తోన్నా. నిశ్శబ్దం అంతటా. ఊరబిచ్చుకలు కొన్ని 'కిట్, కిట్' మంటో యేరుకోతింటోన్నాయి అక్కడక్కడ. అకస్మాత్తుగా కుడివేపుకి మళ్లా. దట్టంగా అల్లుకున్న మల్లెతీగెల్లోంచి వాళ్ల పడకగది, పెద్దకిటికీ, దానికి దగ్గరగా వున్న పెద్ద మంచంపరుపూ అవుపడుతోన్నాయి. నేనట్లా చూస్తోండగనే జారిపోయే పైటని సైతం లెక్కపెట్టకుండా పద్మావతి రోజుతో వొచ్చి మంచంమీద కూలబడి దిండులో తలదాచుకొని యేడుస్తోంది. వెనకాలే మాఆయనగూడా వొచ్చి ఆమె పక్కన కూచున్నాడు. ఆమెభుజంమీద చెయ్యేసి తన వేపు తిప్పుకుంటో, "యేడవకమ్మా పద్మావతీ!" అంటోన్నాడు. ఏడుపుమానటంలే దామె. చివరకి బలవంతంగా ఆమెని లాగి తనపై వొరిగించుకొని తన కుడి చేత్తో కళ్లని తుడుస్తో మెల్లగా నాలుగుమాటు లేవో అన్నాడు. అవి వినపళ్లా నాకు గుండె ఝల్లుమంది. వాళ్లు నన్ను చూస్తారేమో నని యీవేపు మళ్లా. ఏం చూశానా అని విచారించా. నిజంగా అట్లా చూశానా, లేక భ్రమా? ఆముహూర్తాన నా హృదయం పొందిన అవస్థని వర్ణించడం నాతరంకాదు. ఒక్కనిమిషం తరువాత మళ్లీ ఆవేపు చూశా. వాళ్లిద్దరూ.....కళ్లు మూసుకున్నాయి. ఎడమవేపు తిరిగి ముఖాన్ని గరకలో దాచి యేడ్చా. ఎందు కేడ్చానా అంటే నాకే తెలీదు. రెండు నిమిషాలు గావును అట్లా వున్నా. తిరిగి ఆ కిటికీవేపు చూశా. వట్టి మంచమే వుంది. వాళ్లు లేచిపోయారు.

మాఆయన్ని గురించి యెన్నోసార్లు యెంతరో చెప్తే అంతా అబద్ధ మని తోసేసా. సానివాళ్లకు గూడా డబ్బు తగలేస్తా డని విన్నా. కాని యేవీకూడా నమ్మలేదు. నన్నొక దేవతలా ఆరాధిస్తో పువ్వులా చూసుకుంటో తిరిగే ఆయన్ని గురించి యిట్లాంటివి నమ్మటమే! నన్నమాంతం తన రెండుచేతుల్లో యెత్తుకొని తన హృదయానికి అదుముకుంటో, "నువ్వు నా దానివవటం పూర్వజన్మ సుకృతం కామూ, నాది" అంటోంటే యితర్లు చెప్పుకునే విషయాలు నిజమేనా అనికూడా అనుమానపడటానికి గుండె లొస్తాయా? ఆయన నన్ను సంతోషపెట్టడాని కట్లా ప్రేమప్రకటన గావిస్తాడా, లేక నిజంగా హృదయపూర్వకంగానా అని పరీక్షించాకూడా యెన్నోసార్లు. ఒక్క నువ్వుగింజంత కపటమైనా ఆహృదయంలో అవుపడదు. అలాంటాయన యితరస్త్రీలకోసం ఆశపడ్తాడంటే యేమాత్రం నమ్మలేదు. మరిప్పుడో? నాకళ్లని నమ్మకండా తోసే

యటంకూడా సులభంకాదు. ఒకసారి కాదు, రెండు తడవలా చూశా.

ఎంతసే పక్కడున్నానో తెలీదు. "అరే బుజ్జి యిక్కడే నిప్రపోయిందే" అనే డాక్టరుమాటలు వినపడ్డాయి. చప్పున లేచా. ఆయన నాపక్కనే నుంచున్నాడు, బుజ్జివేపు చూస్తో.

"ఇప్పుడే వొస్తోన్నారా హాస్పిటాలునుంచి?

"అవును."

నావేపు తిరిగి నాపక్కన పడున్న గులాబి రెక్కలకేసి చూసి నిర్ఘాంతపోయాడు. ఒకటి రెండు రెక్కల్ని చేత్తో యెత్తి, "ఎక్కడివివి?" "ఏం, ఆ మొక్కవి." చేతిమూరంలో వున్న ఆమొక్కని చూపించా. ఉగ్రుడై తన చేతుల్లోని రెక్కల్ని నేలకికొట్టి, "నా ఆర్నెల్ల కృషిని గంగలో కలిపారు. వందరూపాయిల మందుల్తో నిన్నపొద్దున్నే ఇంజెక్షన్ ఇచ్చాయీ మొక్కకి. గంటగంటకి పూలల్లో కలుగుతోండే మార్పుని రికార్డు చేస్తోన్నాను."

"క్షమించండి, నాకు తెలీదిదంతా."

"ఇదేమిటి పెద్దపెద్ద అక్షరాల్తో చీటీగూడా తగలేశాగా" అంటో ఒక్కఅడుగావేసి మొక్కకు వేళ్లాడుతోన్న చీటీని లాగి నాముందు పడేశాడు. 'ఈచెట్టుని ముట్టుకోగూడదు' అని వుంది దాంట్లో.

"ఏదో ఆలోచన్లో వుండి ఆచీటీని చూళ్లేదండీ" అన్నా. నిజంగా చూళ్లేదు. ఆపూలని నాచేతులు తెంపిందికూడా నాకు తెలీదు. ఇంతట్లోకి ఆయనమాటలవల్ల బుజ్జి లేచింది. తోటమాలి వొచ్చి, "మీకోసమెవరో వొచ్చారు" అన్నాడు. తనకి తెలీనట్టే మెల్లగా వెళ్లిపోయినాడు డాక్టరు. రోగి, గులాబి యీ రెండే యీ ప్రపంచంలో ఆయన గణించేది.

"ఎందుకత్తయ్యా, నాన్నకు కోపమొచ్చింది?" అంది బుజ్జి.

ఏమని చెప్పను దాంతో? "మీ అమ్మేదో చెడ్డపని చేసిందట, అందుకని కోప్పడుతోన్నాడు."

తల కిందికీ, మీదికీ ఆడిస్తో, "పుస్తకంలోని బొమ్మల్ని చింపిందా?"

"అవును, మీనాన్న బొమ్మని చింపేసింది."

౨

"నాలుగైదు రోజు లుంటామని వొచ్చాంకదా, యీవాళే తిరిగివెళ్ళట మెందుకు?" అన్నాడాయన బుజ్జిని తన కాళ్లపై వుయ్యాలూగిస్తో.

"ఏమో నాకు బాగనిపించటం లేదిక్కడ."

బుజ్జిని వొదిలి, "అసలు కారణమేమిటో చెప్పు, కామూ. నాతో చెప్పటాని కేం?"

ఆ 'కామూ' అనేముక్క ఆ కంఠంలోంచి బైటపడటంతోటే నాహృదయం కరిగిపోయింది. నాపక్కన వొచ్చి కూచోని నాముఖాన్ని తనవేపు తిప్పుకుంటూ, "ఎందుకుకామూ, యేడవటం? నాకు తెలుసు, నిజంగా నిన్నేదో బాధిస్తోంది. నాతో చెప్తావుగదూ!" చప్పున ఆదృశ్యం మళ్లీ జ్ఞాపకమొచ్చింది. పద్మావతినికూడా యిట్లానే తనపై వొరిగించుకొని బుజ్జగించాడు. ఆయనదేహం, చేతులు ముళ్లకంపలా అనిపించాయి. చప్పున ఆయన్ని వొదిలించుకొని కిటికీదగ్గిరకెళ్లి బైటికి చూస్తో నుంచున్నా. బైట పద్మావతి మల్లెపొదదగ్గిర నుంచోని పూలని తెంపుతో, "సత్యాపతి ఆన మీరగలడా..." అనే పాటని, దాంట్లోని భావాన్ని, ప్రాణాన్ని బొత్తిగా చంపేసి తబలామ్రోగుడికి అనుకూలించేట్టు కూనరాగంతో పాడుతోంది.

"ఉండు పద్మావతీ నేనొస్తోన్నా" అంటో ఆకిటికీలోంచి దూకి పద్మావతిని చేరుకున్నా. ఏమేమిటో మాట్లాడుతో పూలు తెంపుతోన్నాం, అర్థం లేకండా నవ్వుతో, పాడుతో. ఆధోరణిలో పద్మావతంది: "ఇలా మీ రిక్కడికొచ్చివున్న మూడునాలుగు రోజులు స్వర్గంలా వుంటుంది నాకు. లేకపోతే ఖైదే ఒహావిధంగా."

"అవును, నేను రాక మాఆయన వొకడే వొచ్చివుంటే మహాస్వర్గం" అనుకున్నా మనఃసులో. పై

కన్నా: "అవును మనకి కావాల్సినవాళ్లు లేక యెందరుంటే నేం ?"

"డాక్టర్ గారు పొద్దునా, సాయంత్రం హాస్పిటాలుకి వెడ్తారా ; మధ్యాహ్నం తీరుబడి వున్నప్పుడంతా ఆగులాబిమొక్కలూ, ఇంజెక్షన్లు అవీను. ఇహ యెవర్తో మాట్లాడను నేను ?"

"ఆయనప్రపంచమే వేరు."

నిజంగా అట్లాంటి మహానుభావుడు ఇట్లాంటి వాళ్లని ముడిపెట్టుకోడమే తప్పు !

మాఆయన వొచ్చి పద్మావతి వేపు చూస్తో అన్నాడు: "ఏమండీ డాక్టరుగారెక్కడ ?"

ఆమె వెనక్కి తిరిగి "స్నానం చేస్తోన్నారు."

"మేమెనిమిదిగంటల బండిలో వెడ్తోన్నాం."

చెట్టుమల్లే నిలిచిపోయింది పద్మావతి. నేను కూడా నిర్ఘాంతపోయి ఆవేపు చూశా. "ఏం ?" అంది.

"రేపు చాలాముఖ్యమైన పనుంది మా కక్కడ. ఇక్కడి కొచ్చేప్పుడు మరిచా ఆవిషయం."

"నాలుగురోజు లుంటా మన్నారుకదూ ?"

"చెప్పాగా ఆవిషయం ముందు జ్ఞాపకంలేదని."

"కిన్నెరగుట్టల్లో రేపటిరోజంతా గడుపుదామనుకున్నాం" అంది దీనంగా. ఆశాభంగం కలిగిన ఆముఖం చూస్తే యెంతటి కఠినహృదయులకైనా దయ కలుగుతుంది; పాప మనిపిస్తుంది.

కిన్నెరగుట్టలు వాళ్ల వూరికి దాదాపు పదిమైళ్ల దూరంలో పెద్ద అడవిమధ్య వుంటాయి. చాలా అందమైనవి నిజంగా అవి. అన్నిటికన్నా పెద్దవి రెండు గుట్టలు ఒహదానిపక్క నుంకొహ టున్నాయి. వాటి రెండిటి మధ్య విశాలమైన అల్లనేరిడిచెట్లు, వెలగచెట్లు, పారిజాతపుచెట్లు, రకరకాల పూలపొదలు, వాని గాఢమైన నీడల్లోంచి మెత్తని యిసుకపరుపుల్లో వంకర టింకరగా పారే స్వచ్ఛమైన ఊటకాలువలూ తలుచుకుంటే హృదయం అనుభవంకోసం తల్లడిల్లుతుంది. ఉడతలు, కుందేళ్లు, లేడిపిల్లలు, కోతులు ఆకాలవల్లో నీళ్లు తాగటాని కొచ్చి మనల్ని ఒక్కచూపు చూసి వెనక్కి మళ్లి పరుగెత్తుతో మనం వాట్ని వెంబడిస్తోన్నా మేమోనని మెడల్ని మెలేసి వెనక్కి తిరిగి చూస్తో పరుగెత్తుతోంటే యెంతో బాగుంటుంది. నెమిళ్లు, జంటలుగా తిరిగే అడవిపావురాలు, అడవికోళ్లు, యింకా అనేకరకాల పక్షులు తమదే ప్రపంచం అన్నట్టు విహరిస్తో మనల్ని చూసి బెదిరిపోతోంటాయి. ఒకరోజంతా అట్లాంటి ఆగుట్టలమధ్య గడపాలనీ, ఆనీడల్లో వూటకాలవలపక్కనే వంటుకోతినాలనీ ఎన్నాళ్లనుంచో ఉవ్విళ్లూరించుకుంటో ఆనాడు ఏర్పాటుచేసుకున్నాం. అట్లాంటి అమూల్యతరుణం నామూలాన్నే జారిపోతోందని నాకు తెలుసు. అదట్లా జారిపోవడం మాఆయనకిగూడా విచారంగానే వుంది. అందుచేతే పద్మావతిమాటకి జవాబుచెప్పక మల్లెపొదవేపు చూస్తోన్నాడు.

"క్యాంపుకి వెళ్లొచ్చి రేపుసాయంత్రం వెళ్లొచ్చు" అన్నా.

ఆయన నావేపు చూసాడు. ఆతని ఆచూపులు నాకళ్లగుండా నా హృదయాన్ని చూశాయి. పద్మావతికూడా నాకేసి చూసింది, ఆతీర్పంతా నాచేతుల్లోనే వున్నట్టు. అట్లాగే సూటిగా నాలోకి చూస్తో అన్నాడాయన: "వీల్లేదు, చాలా ముఖ్యమైనపనది."

డాక్టరు, చంకలో నవ్వుతో బుజ్జి వొచ్చారు. వచ్చే రావటంతోనే బుజ్జి మాఆయనవేపు చేతులు కొడ్తో, "నువ్వు అమ్మని యెత్తుకో మామయ్యా" అంది. పద్మావతి బుజ్జిని పొడిచేసేట్టు ఒక్క వాడిచూపు చూసింది. కాని బుజ్జి ఆవేపు చూస్తేనా ! "అమ్మోం బుచ్చి పిల్లా నీమల్లే" అన్నాడు అమాయకపు డాక్టరు. "మరి పొద్దునె..." మాటలొచ్చే పసిపిల్లల్తో చాలా కష్టం. వాళ్ల ముందు చాలా జాగ్రతగా వుండాలి. పద్మావతి అమితంగా తెలివి కల్ది. ఆమెకి తెలుసు, బుజ్జి యేమనబోతోందో. అందుకనే బుజ్జిని మాట్లాడనివ్వకండా గట్టిగా "వీళ్లీపూట వెళ్లిపోతారట" అంది డాక్టర్తో.

ఆయన నావేపు చూసి "ఏం ?" అన్నాడు.

"రేపు చాలా ముఖ్యమైన పనుంది" అన్నాను. నాకడుపులో వుడుకుతోం దసలు.

"ఇక్కడి కొచ్చేటప్పుడు జ్ఞాపకం లేదు. ఈపూట వెళ్లితీరాలి" అన్నాడు మాఆయన.

నన్ను లొంగదీసేపద్ధతి పద్మావతికి బాగా తెలుసు. "రేపటిదినమంతా ఆ తేటనీటికాల్వల యిసుకల్లో చిన్నిఉడతలమై విహరిద్దా మనుకున్నా" అంది. అయినా ఆమెకన్నా మొండిదాన్ని నేను మరి. అదీ ఆబుజ్జిమాట విన్నాకనా లొంగిపోవటం నేను! "ఏంచేస్తాం మరి వీలుపడనప్పుడు!" అన్నా.

"పోనీ, మళ్లీ యెప్పుడైనా వెడ్దాం. పర్షియా నుంచి తెప్పించిన గులాబిచిత్తుల్ని పరీక్షించాల్సుంది రేపు నాకుగూడా." అని డాక్టరన్నాడు.

ఆయన్ని చంపిపారేయా లన్నంతకోప మొచ్చింది పద్మావతికి.

రైల్లో కొంతదూరం వెళ్లాక ఆయన్తో అన్నా: "నిజంగా యేంపనండీ రేపు?"

"నాకేం తెలుసు, నీకే తెలియాలి."

"అంటే?"

"నువ్వు వెళ్లొద్దా మన్నావు గాబట్టి వొచ్చాం."

"ఎన్నాళ్లనుంచో తలపెట్టుకున్న క్యాంపింగుని నిజంగా నాకోసమేనా మానుకుంది మీరు?"

నారెండుచేతుల్ని తన చేతుల్లో పట్టుకొని, "నిన్ను ప్రసన్నురాలిని జేయటంతప్ప వేరేం కావాలి నాకు కామూ!"

ఆతన్ని వొదిలించుకొని నా రెండుచేతులూ ఆయనమెడచుట్టూ అల్లుకున్నాయి.

## 3

ఎందుచేతోకాని ఆవాళ సాయంత్రం చాలా అలిసిపోయా. చేతులు, కాళ్లు కదల్చడం కష్టంగా తోచింది. చల్లగా స్నానంచేసేసరికి దేహాన్ని వూగించేట్టు నిద్ర కమ్ముకుంది. అలాగే నాలుగుమెతుకులు గొంతులో పడేసుకొని గదిలో కెళ్లా. ఆయన టేబిల్ ముందు కుర్చీలో కూచున్నాడు. దీపం పెద్దగా వెలుగుతోంది. ముంద రేదో లావాంటి పుస్తకం తెరిచుంది. కాని దానివేపుగూడా చూట్టంలేదు. ఆ సగం మూతబడ్డ కళ్లు యెటో చూస్తోన్నాయి. మంచి సారాయిత్రాగిన వాడి ముఖంమల్లే వుంది ఆయనముఖం. నా చప్పుడు వినటంతోటే బరువుగా నాలుగడుగులేసి నాముందు నుంచున్నాడు. నారెండురెట్టలూ పట్టుకొని యింకా మూసుకోపోయే కళ్లగుండా ఎగాదిగా చూసాడు పెద్దపులిలాగ. భయమేసింది. మెల్లిగా చేతుల్ని వొదిలించుకోపోయా. చప్పున మహోఉద్రేకంతో నిరాకరిస్తోన్నా వినిపించుకోకుండా నన్నంతా తనకి అదుముకొని నలుపుతో ముద్దెట్టుకున్నాడు. వొళ్లంతా నొప్పెట్టింది. అమాంతం మంచంలో పడిపోయా. మళ్లీ దగ్గరకి రాబోతోంటే కాలితో తన్నేసా. నిజంగా ఆవొక్కక్షణం శ్వాస ఆగిపోయింది. వొళ్లంతా ప్రెస్సులో వొత్తినట్టయింది. "ఛీయేమి టీపశుత్వం? ఈపందిబలం వున్నందుకేనా మొగాడి ఆధిక్యత?" ఇంకా యేమేమో అనేశా గబాగబా. అట్లాగే వుండిపోయాడు. పెద్దమార్పు. ఆ మత్తు. ఉద్రేకం అన్నీపోయి దయాపూరితదృక్కుల్తో చూస్తోన్నాడు. పశ్చాత్తాపం ఆ ముఖాన్ని ఆవరించింది. మెల్లిగా దగ్గిరి కొచ్చి, "క్షమించు కామూ, ఏదో పిచ్చి ప్రపంచంలో వుండి నువ్వోహ దేవతివని మరిచి అలా ప్రవర్తించా." అన్నాడు. నే నావలివేపు ముఖం తిప్పుకున్నా. లేకపోతే స్త్రీలలో పట్టుదల వుండదనరు మరి!

అట్లాగే స్టూలుమీద కూచున్నాడు.

కాస్త మెలకు వొచ్చేప్పటికి పక్కగదిలోని గడియారం పన్నెండు కొట్టింది. ఆవేపు చూస్తే స్టూలుపైన అట్లాగే కూచున్నాడు ఆలోచిస్తో. కనికర మనిపించింది. "పడుకుంటే? మళ్లీ పొద్దున్నే లేవాలి."

పెద్ద తప్పుచేసిన కుఱ్ఱాడిలాగా లేచొచ్చి నా పక్కన నన్ను తగలకండా దూరంగా ముదురొక్క పడుకున్నాడు.

రెండు గంటలకి మెలకువొచ్చింది. ఆయన లేడు. నా కఠినప్రవర్తనకి విసుగెత్తి యేదైనా అగాయిత్యం చేసాడేమో నని భయమేసింది. లేచి గదిబైటి కొచ్చా. తోట్లోని బాయివేపు వెళ్లా. తలుపు తెరుచుంది. కాళ్లు వొణికాయి. ఏడ్పు కుత్తుకలో కొచ్చింది. సరాసరి బాయివేపు పరుగెత్తా. మూలవేపు తిరగటంతోనే బాయిదెగ్గిర గచ్చుమీద తోట్లో పనిచేసే మాల లచ్చి, ఆయన.........

* * * *

ఏమిటో అసహ్యమేసింది. మాటకూడా మాట్లాట్టం మానుకున్నా. కాని ఆయనప్రవర్తనలోమాత్రం భేదం రాలేదు. ఇంకా తన జీవితమంతా నాకోసమే అన్నట్టు మెదిలేవాడు. మొదటిరోజుల్లో నేననుకున్నా యిట్లా నాప్రవర్తనని మార్చడంవల్ల పశ్చాత్తాపపడతాడేమో, బాధపడతాడేమోనని. నాదెగ్గిరి కొచ్చి క్షమించమని ఏడుస్తాడేమోననికూడా అనుకున్నా. కాని తనుకూడా విచిత్రంగా మెదలడం ఆరంభించాడు. సాధ్యమైనంతవరకు నన్ను చూట్టంగాని నాతో మాట్లాట్టంగాని అవసరంకాకుండానే ప్రవర్తించేవాడు. విధిలేక ఎప్పుడైనా వొకటిరెండు ముక్కలేవో మాట్లాడాల్సొస్తే తీయగా హృదయం కరిగిపొయ్యేట్టు మాట్లాడేవాడు. తన చిన్నమంచం లైబ్రరీలో వేయించుకొని పడకకూడా అక్కడనే ఆరంభించాడు. "లోపలెందుకు పడుకో" రని నేనూ అడగలా. వంట అయిందంటే రావటం, పెట్టిందేదో తిని వెళ్లటం. మా కారుని, డ్రైవరుని నాకోసం వొదలేసి తను నడిచో, లేక స్నేహితుల కార్లోనో వెళ్లేవాడు. ఇదంతా యెందుకు, ఆ యిల్లూ సంసారం అంతా నాదై తను నా నౌకరైనట్టు మెదలటం మొదలెట్టాడు.

నెలరోజులు గడిచా యిట్లా. ఆయేడు యెండలు విపరీతం. టైఫాయిడు వొచ్చింది నాకు. పెద్దపెద్ద డాక్టర్లని తీసుకొచ్చాడు. ఉపచారం చేయటానికి నర్సునొహామెని ఏర్పాటు చేసాడు. కాని మాఆయన్ని ఈమధ్య కొంత అర్థం చేసుకున్నప్పటినుంచి ఏ పరస్త్రీ మా యింటి కొచ్చినా నాసవతిమల్లే అవుపడేది నాకళ్ళకి. దాంట్లో ఇంగ్లీషు చదివి టిప్‌టాప్‌గా ఉండే నర్సునా నేను మాయింట్లో భరించడం! నర్సు వొద్దని చెప్పేసా మాఆయన్తో. తక్షణమే ఆమెని చాలించి ఆఫీసుకి సెలవు కోసం రాసి ఆ నర్సుచార్జి తను పుచ్చుకున్నాడు. శ్రేష్ఠమైన ఆ నర్సుకన్న యెన్నోరెట్లు శ్రద్ధగా, వోపికగా అన్ని ఉపచారాలు చేయటం ఆరంభించాడు. రాత్రంతా నిద్ర లేకుండా కాచుకో కూచోడంచేత రోజురోజుకీ తీసిపోతోన్న ఆయనముఖం చూస్తే ఆయన చేసిన పనులన్నీ మరచి హృదయం తరుక్కోపోతుంది. కాని యేమిటి చేయడం?

ఆనాడు పొద్దున ఆరుగంటలై వుంటుంది బహుశా. చల్లగా గాలి వీస్తోంది. కళ్లువిప్పి చూసేప్పటికి నాకాళ్ల దెగ్గిర కుర్చీలో కూచుని ముందుకు వొంగి తలని రెండుచేతుల్లో పట్టుకున్నాడు. పక్కన చిన్న గుండ్రని టేబిల్ మీద మందు సీసాలు, టైంపీసు, థర్మామెటరు యింకా యేమేమో వున్నాయి. నేను కాస్త కదిలాను గావును, నాముఖంవేపు చూసాడు. జాజుమల్లె యెఱ్ఱబారిన కళ్లల్లోంచి నీటిచుక్కలు కారుతోన్నాయి. చప్పున లేచి షర్టుకప్పుతో కళ్లు తుడుచుకొని నాతలకి దెగ్గరగా నేలమీద కూచొని ఒకచేత్తో నొసలు ముట్టుకొని నవ్వుముఖంతో, "ఎలా వుంది కామూ?" అన్నాడు. నేను పెదిమలు కదల్చకముందే డాక్టరు మెకన్జీ గదిలోకి రావటంవల్ల ఆయన లేచి నుంచున్నాడు. గదిగుమ్మంలో నౌకర్లు నుంచొని నావేపు తొంగి చూస్తోన్నారు. డాక్టరు నన్నొకపదినిముషాలు పరీక్షించి "చాలా నయంగా వుంది. నాడి సక్రమంగా నడుస్తోంది" అని చెప్పి ఆయన్తోకూడా బైటికెళ్లాడు. ఒక ఐదు నిముషాల తరువాత ఆయన తిరిగొచ్చి ముందటిమల్లే తలదెగ్గిర కూచొని ముఖానికి దెగ్గరగా "నయంగా వుంది గదూ కామూ?" అని అడిగాడు మెల్లిగా. ఆయనఆదీనమైన ముఖాన్ని చూస్తే ఏమిటో అనిపించింది. నావొళ్లు వశంలో వుంటే ఆబుచ్చిముఖాన్ని వక్షాని కదుముకొని కంటి నీరాతలపై బడేటట్టు ఏడ్చేదాన్ని. కాని చేతి వేలినికూడా కదల్పలేకపోయా. "ఏడ్పెందుకు?"

అన్నా, గొప్ప ప్రయత్నంచేత. తనచేతిని నా మీఁదేసి మెల్లిగా "ఏడుపు గాదు, సంతోషాతిశయం" అన్నాడు.

చిన్నఫ్లాస్కుతో పాలు తాగిస్తోంటే గదిలో మూలనున్న మురికిగుడ్డల కుప్పమీద కెళ్లింది దృష్టి. ఎంతో ప్రేమతో బొంబాయినుండి తెచ్చుకొన్న ఆయన పట్టుకండవాలు దాంట్లో అవుపడ్డాయి. ఆయన వాటిని నాకోసమే పాడుచేసుకున్నాడన్న జ్ఞానమే నాహృదయాన్ని వూపేసింది. ఆయనకోసం యిన్నాళ్లు నాలో దాగుండిన ప్రేమంతా వొక్కసారికే బైటికి పొంగొచ్చిన ట్టయింది. ఆతని కళ్లకేసి చూస్తో "మీరు నిజంగా నన్నిట్లా ప్రేమిస్తా రనుకోలే" అన్నా. ఫ్లాస్కుని కప్పులో వుంచి మెల్లగా నాచెంపమీది తడిని తుడుస్తో, "ఈపాలల్లో కలిపిన మందువల్ల నిద్ర వొస్తుంది. ఒకగంటసేపు నిద్రపోయావంటే చాలా నయమవుతుంది" అన్నాడు మృదువుగా. ఆ విషయమే మరిచిపోవా లనుకున్నా. కాని రెండునిమిషాలతరువాత, "అప్పుడప్పుడు నేను చూసిందంతా అబద్ధమనేయండీ, నమ్మతా."

"నిజాన్ని అబద్ధమని ఎలా అనను కామూ?"

"మరి?"

నావీపుమీద చేయేసి దగ్గిరగా జరిగి "కోకిలకు వసంతమాసంమల్లే నాబ్రతుకంతటికీ నువ్వే ఆధారం కామూ. నువ్వే నాసర్వస్వం. నాకు తెలుసు నువ్వు కేవలం మానవస్త్రీవి కావని. ఈరూపంలో దాగున్న నాయిష్టదేవతవి. నేను పూర్వజన్మాన చేసుకున్న ఆమహాపుణ్యానికి ఫలితంగా ఆదేవుడే నీరూపాన యీప్రపంచాని కొచ్చాడు నాకోసం."

అవి కేవలం నాటకాల్లో అనే మాటలు గావు. ఆతని హృదయాన్ని చీల్చి బైటపడ్డ వాక్కు లవి. "మరి ఆ పస్లేమిటి?" అని అడిగా.

"నేను దుర్బలుడిని కామూ. నాలోని పశుత్వం నన్ను అప్పుడప్పుడు పూర్తిగా దాసుణ్ణి చేసుకొని ఎన్నో దుష్కార్యాలని చేయిస్తుంది. ఎంతప్రయత్నించినా దాన్ని జయించడం నాతరంకాదు."

మరీ దగ్గిరగా జరిగి దీనంగా చూసాడు. నీళ్లు కారే ఆతని కళ్లగుండా చూస్తే ఏమిటో అనిపించింది. మెల్లిగా వినీ వినపడనట్లు మళ్లీ అన్నాడు: "నాకు తెలుసు. నీహృదయం అమితంగా విశాలమైంది; మహాసముద్రంలాంటిది; మురికినదుల్లో బురదతో కొట్టుకొవొచ్చిన తామరలని కడిగి తనలో లీనం చేసుకుంటుంది."

మెల్లిగా నాచేతిని లేపి ఆతని చెంపని తాకా. ఆచేతిని అట్లానే పెదిమల కదుముకొని, "దేవతవి. దేవతని నువ్వు, కామూ." అన్నాడు, కృతజ్ఞత ఆ కళ్ల నుండి వొలికిపోతోండగా.

అయిపోయింది.